
సాక్షి
చిత్తూరు
శనివారం । 25 । మే । 2024



డీవైఈఓ పరీక్షలకు సర్వం సిద్ధం
జిల్లాలో శనివారం జరిగే ఏపీపీఎస్సీ (డీవైఈఓ) పోస్టుల పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు డీఆర్‌ఓ పుల్లయ్య తెలిపారు. - 8లో



పుష్పపల్లకిపై ద్రౌపదీదేవి విహారం
గుడుపల్లె మండలంలోని యామగానిపల్లెలో శుక్రవారం ద్రౌపదీదేవి పుష్పపల్లకి ఉత్సవం వైభవంగా జరిగింది. - 8లో



ఉపాధికి మెండైన పాలి'టెక్నిక్'
ఉపాధికి పాలిటెక్నిక్ కోర్సులు దగ్గరి దారని పలమనేరు ఆర్‌డీవో మనోజ్‌రెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. - 8లో

న్యూస్‌రీల్

'సాక్షి' మైత్రి మహిళ ఆధ్వర్యంలో... బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ

తిరుపతి అర్బన్ : సాక్షి, మైత్రి మహిళా ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి జూన్ 25వ తేదీ వరకు మహిళలకు బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నారు. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ ఉంటుంది. ఈ మేరకు త్రెడ్డింగ్, వ్యాక్స్, పెడిక్యూర్, మెనిక్యూర్, బ్లీచింగ్, స్కిన్ కేర్, హెయిర్ కేర్, వైట్నింగ్ ఫేస్ ప్యాక్స్, డాండ్రఫ్ ట్రీట్మెంట్, హెయిర్ ఫాల్ ట్రీట్మెంట్, హెయిర్ కట్స్, హెయిర్ స్టైల్స్, హెన్నా ప్రిపరేషన్, డై అప్లికేషన్, మేకప్స్ (బ్రైడల్, పార్టీ, లైట్ మేకప్స్), హెయిర్ మసాజ్, కమ్యూనికేషన్ అండ్ గ్రూమింగ్, ఫేషియల్స్, శారీ డ్రాపింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు సర్టిఫికెట్లు అందిస్తారు. ఆసక్తి గలవారు ఈ నెల 27వ తేదీ లోపు బైరాగిపట్టెడలో ఆర్చి రోడ్డులోని అనంగా బ్యూటీ స్టూడియో ట్రైనింగ్ సెంటర్‌లో రూ.3 వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇతర వివరాలకు 9553454335, 8555974855 నంబర్లలో సంప్రదించాలి.

ప్రశాంతంగా సప్లిమెంటరీ పరీక్షలు



చిత్తూరు పీసీఆర్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద హాల్ టికెట్ తనిఖీ చేస్తున్న పోలీసు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఇంటర్మీడియట్, పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పదవ తరగతి పరీక్ష కేంద్రాలను డీఈఓ దేవరాజు, ఇంటర్ పరీక్ష కేంద్రాలను డీవీఈఓ సయ్యద్ మౌలా పర్యవేక్షించారు. కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పర్యవేక్షించారు. మొదటి రోజు పదవ తరగతి పరీక్షలకు 1,235 మందికి గానూ, 620 మంది హాజరయ్యారని అధికారులు వెల్లడించారు. ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ప్రథమ సంవత్సరంలో 3,154 మందికి 2,933 మంది పరీక్షలకు హాజరుకాగా, మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 963 మందికి గాను 873 మంది విద్యార్థులు హాజరయ్యారని అధికారులు తెలిపారు.

గురుకుల అడ్మిషన్లు ప్రారంభం

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్లలోని మహాత్మా జ్యోతీబాపూలే బీసీ బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదవతరగతిలో ప్రవేశానికి శనివారం నుంచి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపల్ బి.సునీత తెలిపారు. పాఠశాలలో 40 సీట్లు ఉన్నాయన్నారు. ప్రవేశానికి ఇప్పటికే రాత పరీక్షలు నిర్వహించామని, అర్హత సాధించినవారికి సమాచారం కూడా ఇచ్చామని పేర్కొన్నారు. అడ్మిషన్‌కు వచ్చే వారు ర్యాంకు కార్డు, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు. అడ్మిషన్లకు ఈనెల 30వ తేదీ తుది గడవని తెలిపారు.

మిగులు సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్

పలమనేరు: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాలల్లో ఇంటర్ మీడియెట్‌లో ప్రవేశాలకు వెబ్ కౌన్సెలింగ్ పూర్తయిందని, మిగిలిన సీట్లకు త్వరలో స్పాట్ కౌన్సెలింగ్ ఉంటుందని జిల్లా కోఆర్డినేటర్ ఈ జయభారతిదేవి తెలిపారు. స్థానిక గురుకుల కళాశాలలో శుక్రవారం ఇంటర్ ఫస్ట్ ఇయర్ ప్రవేశాలకు వెబ్ కౌన్సిలింగ్ జరిగింది. ఈ కౌన్సిలింగ్‌కు ఉమ్మడి జిల్లాలో ఆయా కళాశాలల్లో ఖాళీలను బట్టి 800పైగా విద్యార్థులు హాజరయ్యారు. వెబ్ కౌన్సెలింగ్‌లో భర్తీగాని సీట్లకు సంబంధించి త్వరలో స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ త్వరలో ఉంటుందని, తేదీని త్వరలో ప్రకటించనున్నట్టు ఆమె తెలిపారు.

ఆరోగ్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు

కాణిపాకం: ఆరోగ్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రభావతిదేవి అన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో ఆమె శుక్రవారం వైద్యాధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. లెప్రసీ, టీబీ వ్యాధిగ్రస్తులకు అందించాల్సిన సేవల్లో ఎలాంటి లోపాలు తలెత్తకూడదని సూచించారు. మాతా శిశు సేవలపై నిర్లక్ష్యం వద్దన్నారు. బీసీజీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని తెలిపారు.

బాణసంచా దుకాణాలకు నోటీసులు

గంగాధర నెల్లూరు: సార్వత్రిక ఎన్నికల నిబంధనల మేరకు పెట్రోల్ బంకు యాజమాన్యాలకు, బాణసంచా విక్రయదారులకు అధికారులు శుక్రవారం నోటీసులు అందజేసి సూచనలు అందించారు. కౌంటింగ్ ముగిసే వరకు ఎలాంటి టపాకాయలు, బాటిళ్లు, డ్రమ్ముల్లో పెట్రోలు విక్రయించకూడదని ఆయా దుకాణ యజమానులకు నోటీసులు అందజేశారు.

ఇంటర్మీడియట్ బోర్డు సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షల జవాబుపత్రాలను ఆన్‌లైన్‌లో ఎగ్జామినర్‌లు దిద్దే ప్రక్రియను ప్రారంభించనుంది. ఈ మేరకు ఇంటర్ విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేసి, విధి విధానాలు సూచించారు. శుక్రవారం నుంచి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జూన్ 1వ తేదీ నుంచి ఆన్‌లైన్ మూల్యాంకనం ప్రారంభానికి చర్యలు ప్రారంభమయ్యాయి. ఆన్‌లైన్ మూల్యాంకనంపై ప్రత్యేక కథనం.



ఆన్‌లైన్ మూల్యాంకనం ఆన్‌లైన్ ఊహాచిత్రం

ఆన్‌లైన్లో మూల్యాంకనం

- ప్రారంభమైన సప్లిమెంటరీ పరీక్షలు
- సాంకేతికతను అందిపుచ్చుకున్న బోర్డు
- జవాబుపత్రాలు ఆన్‌లైన్‌లో వాల్యూయేషన్
- త్వరితగతిన ఫలితాల విడుదలకు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా 31 పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలు జరుగనున్నాయి. ఫస్ట్ ఇయర్ పరీక్షలకు 7,442 మంది, సెకెండియర్ పరీక్షలకు 2,577 మంది హాజరుకానున్నారు. ఈ పరీక్షలు పూర్తికాగానే త్వరితగతిన మూల్యాంకన ప్రక్రియను పూర్తి చేసి ఫలితాలను త్వరితగతిన వెల్లడించేందుకు ఇంటర్మీడియట్ బోర్డు వినూత్న పద్ధతిని ప్రారంభించనుంది. మ్యానువల్‌గా మూల్యాంకనం చేస్తే ఫలితాల విడుదల ఆలస్యం కావడంతోపాటు అడ్మిషన్లలో విద్యార్థులకు, తరగతుల నిర్వహణలో అధ్యాపకుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీన్ని అధిగమించేందుకు ఆన్‌లైన్ మూల్యాంకన విధానాన్ని అమలు చేయనుంది. ఈ విధానంలో ఎలాంటి పొరబాట్లకు ఆస్కారం ఉండదని ఇంటర్మీడియట్ అధికారులు వెల్లడిస్తున్నారు. మ్యానువల్‌గా మూల్యాంకనం చేసే సమయంలో మార్కుల టోటలింగ్‌లో పొరబాట్లు, కొన్ని ప్రశ్నలకు మార్కులు వేయడం వంటివి మరిచిపోవడం పలు ఘటనలు జరుగుతుంటాయి. గతంలో ఒక విద్యార్థికి 70 మార్కులు వస్తే టోటల్ మార్కులు వేసే సమయంలో పొరబాటున సున్నా ఎగిరిపోయి 7 మార్కులు మాత్రమే వేశారు. తర్వాత రీ వెరిఫికేషన్‌లో అసలు విషయం బయటపడింది. ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. ఇకపై ఆ పరిస్థితి ఉండదని ఇంటర్ అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఒక ప్రశ్న తర్వాత మరో ప్రశ్న

ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేసేటప్పుడు ఒక ప్రశ్నకు విద్యార్థి రాసిన సమాధానాన్ని ఎగ్జామినర్ పూర్తిగా మూల్యాంకనం చేశాకే మరో ప్రశ్న డిస్‌ప్లే అవుతుంది. ఇలా ప్రతి సమాధానాన్ని పరిశీలించి ఎగ్జామినర్ మార్కులను నమోదు చేస్తారు. అన్ని ప్రశ్నలు పూర్తి అయ్యాకే ఫైనల్ సబ్‌మిట్ వస్తుంది. విద్యార్థులు జవాబు రాసినా, రాయకపోయినా అన్ని ప్రశ్నలు పరిశీలించాల్సి ఉంటుంది. ఈ విధానం వల్ల ఏ ఒక్క ప్రశ్నకు మార్కులు వేయడం మరిచిపోయే అవకాశం ఉండదని ఎగ్జామినర్లు వెల్లడిస్తున్నారు. ఒక ప్రశ్నకు మ్యాగ్జిమం వేయాల్సిన మార్కులకంటే ఎక్కువ వేసినా ఆన్‌లైన్ తీసుకోదు. తరగతులకు ఆటంకం లేకుండా ఆన్‌లైన్‌లో పేపర్లు దిద్దే ఎగ్జామినర్లు ఎట్టి పరిస్థితుల్లో కళాశాలల్లో విద్యార్థుల తరగతులకు ఆటంకం కలిగించకూడదు. ఉదయం 8 గంటలలోపు, తర్వాత కళాశాల నుంచి వచ్చిన తర్వాత మూల్యాంకనం చేసుకోవచ్చు. కళాశాలలో పీరియడ్లు లేని సమయంలోనూ చేసుకోవచ్చు. ప్రతి ఎగ్జామినర్ 'టీక్యూఐడీ' ద్వారా లాగిన్ అయి వెంటనే పాస్‌వర్డ్ మార్చుకోవాలి. తర్వాత వెబ్‌కెమెరా ముందు తన ఫొటో క్యాప్చర్ చేసి లాగిన్ కావాలి. ముందుగా ఐదు ప్రాక్టీస్ పేపర్లు మూల్యాంకనం చేసిన తర్వాత రెగ్యులర్ పేపర్లు అందుబాటులోకి వస్తాయి. ఒక్కో ఎగ్జామినగర్‌కు రోజుకు గరిష్ఠంగా 50 జవాబుపత్రాలు అందుబాటులో ఉంటాయి. విధులకు కేటాయించే ఎగ్జామినర్లే జవాబు పత్రాలను దిద్దుతారు, మరోకరు లాగిన్ య్యేందుకు ఆస్కారం ఉండదు.

అమల్లోకి ఆర్‌ఆర్‌ఎస్‌సీలు

మ్యానువల్‌గా జవాబుపత్రాలను దిద్దేటప్పుడు ప్రతి జిల్లా కేంద్రంలో డీఆర్‌డీసీ (జిల్లా రీ కలెక్షన్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్) అందుబాటులో ఉండేది. ప్రస్తుతం జరగబోయే నూతన విధానంలో డీఆర్డీసీకి బదులు ఆర్‌ఆర్‌ఎస్‌సీ (రీజనల్ రెసిప్షన్ స్కానింగ్ సెంటర్ అందుబాటులోకి తీసుకురానున్నారు. గతంలో డీఆర్‌డీసీ విధానంలో ప్రతి జిల్లాలో జవాబు పత్రాలను సేకరించి ఎంపిక చేసే జిల్లాలను జంబ్లింగ్ విధానంలో పంపేవారు. ఇప్పుడు ఆర్‌ఆర్‌ఎస్‌సీ విధానంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఆరు కేంద్రాలకు జవాబుపత్రాలను పంపుతారు. ఏరోజుకారోజు పరీక్ష పూర్తి అయిన వెంటనే స్పీడ్‌పోస్టు విధానంలో ఆర్‌ఆర్‌ఎస్‌సీ కేంద్రాలకు పంపుతారు. వెంటనే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి మూల్యాంకనానికి చర్యలు తీసుకుంటారు.

> **మంచి విధానం..**
>
> 
>
> సప్లిమెంటరీ పరీక్షల జవాబుపత్రాలను ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేసే ప్రక్రియకు ఉన్నతాధికారులు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాదే ఈ సరికొత్త విధానం అమల్లోకి వస్తోంది. ఇప్పటికే లెక్చరర్‌లకు అవగాహన కల్పించారు. ఈ విధానం చాలా మంచిది. ప్రక్రియ ఎంతో పకడ్బందీగా నిర్వహిస్తారు.
>
> – సయ్యద్ మౌలా, డీవీఈఓ(ఇంటర్), చిత్తూరు జిల్లా

గంగవరం మండలం కీలపట్లలో టీటీడీ అనుబంధ ప్రసిద్ధ శ్రీకోనేటిరాయస్వామివారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం చక్రస్నానం శాస్త్రోక్తంగా జరిగింది. అశేష భక్తులు పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి పునీతులయ్యారు.



పుష్కరిణిలో చక్రత్తాళ్వార్‌కు పూజలు

చక్రస్నానం.. భక్తజన పునీతం

- శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం
- నేడు ఆలయంలో పుష్పయాగం

గంగవరం: మండలంలోని కీలపట్లలో ఉన్న కోనేటిరాయని ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా చక్రస్నానం వైభవోపేతంగా జరిగింది. తెల్లవారుజామున సుప్రభాతం అనంతరం తోమాలసేవ, అభిషేక పూజలు అలంకరణల అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 9 గంటలకు శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీకోనేటిరాయుడు తిరుచ్చిపై ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు వేంచేపు చేశారు. అక్కడ కంకణంబట్టార్ నరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఉభయదేవేరులకు, చక్ర తాళ్వారుకు స్నపన తిరుమంజనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందన సుగంధ ద్రవ్యా లతో అభిషేకించారు. అనంతరం మంగళ వా యిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ అర్చకులు చక్రతాళ్వారుకు పుష్కరిణిలో అవభృథస్నానం చేయించారు. అదే సమయంలో అశేష భక్తులు గోవింద నామస్మరణలతో పుణ్య స్నానాలు ఆచరించి పునీతులయ్యారు. తమ పాపాలను హరించి పునీతులను చేయి స్వామీ అంటూ భక్తులు వేడుకున్నారు. రాత్రి ధ్వజావరోహణం కార్యక్రమంతో తొమ్మిది రోజుల బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. శనివారం సాయంత్రం 4గంటలకు పుష్పయాగం జరుగుతుందని, భక్తులు పాల్గొని శ్రీవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ అధికారులు తెలిపారు. టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర కార్యక్రమాలను, భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.



చక్రస్నాన సమయంలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- 28న సిబ్బందికి మొదటి విడత శిక్షణ
- జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఓట్ల లెక్కింపుపై ఆర్‌ఓలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జూన్ 4వ తేదీన ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు నిర్వహించాలన్నారు. ఎలాంటి తప్పిదాలకు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రిటర్నింగ్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపునకు నియోజకవర్గాల వారీగా అవసరమైన సిబ్బందిని నియమించాలచి తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. ఈనెల 28న సిబ్బందికి మొదటి విడత శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. జూన్ 3న అబ్జర్వర్‌ల సమక్షంలో రెండవ విడత శిక్షణ ఉంటుందని తెలిపారు. ప్రతి కౌంటింగ్ కేంద్రం వద్ద సీసీ కెమెరాలు, వీడియోగ్రఫీ నిఘా ఉంటుందన్నారు. జిల్లాలో ఎక్కడా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్య, ఆర్‌ఓలు మధుసూధన్‌రెడ్డి, చిన్నయ్య, వెంకటశివ, వెంకటరెడ్డి, మనోజ్‌రెడ్డి, శ్రీనివాసులు, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తులకు ముగిసిన శిక్షణ



ప్రసాద్ సుబ్బన్నను సత్కరిస్తున్న న్యాయమూర్తులు



సుదర్శన్ సుందర్‌ను సన్మానిస్తున్న మహిళా జడ్జిలు

తిరుపతి లీగల్ : రాయలసీమ జిల్లాలోని 30 మంది న్యాయమూర్తులకు నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి శ్వేత భవనంలో వివిధ అంశాలపై న్యాయమూర్తులకు శిక్షణ తరగతులు చేపట్టారు. అనంతరం సీనియర్ ట్రైనీలు ప్రసాద్ సుబ్బన్న, సుదర్శన్ సుందర్‌ను న్యాయమూర్తులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో తిరుపతి ఐదో అదనపు జిల్లా జడ్జి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి జడ్జి, జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్మన్ జి.రామ్ గోపాల్ పాల్గొన్నారు.

6 వరకు ఎన్నికల నియమావళి అమలు



చిత్తూరులో తనిఖీలు నిర్వహిస్తున్న డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సీఐలు

చిత్తూరు అర్బన్: వచ్చేనెల 4వ తేదీ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 6వ తేదీ వరకు నిబంధనలు అమల్లో ఉంటాయని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు శుక్రవారం తెలిపారు. కౌంటింగ్ మొత్తం పూర్తయ్యాక కూడా రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రజలు సంయమనం పాటించాలని తెలిపారు. ఓట్ల లెక్కింపునకు సమయం దగ్గర పడుతుండడంతో జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక ప్రాంతాల్లో కార్డెన్‌సెర్చ్ నిర్వహించామన్నారు. చిత్తూరు, పలమనేరు, కుప్పం, నగరి పోలీస్ సబ్-డివిజన్లలో ఆయా డీఎస్పీల ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. వెదురుకుప్పంలో రెండు వేల లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశామన్నారు. కుప్పంలో ఎనిమిది లీటర్ల అక్రమ మద్యాన్ని, చిత్తూరులో రెండు ద్విచక్రవాహనాలు, ఓ ఆటోను సీజ్ చేశామన్నారు. జూన్ 6వ తేదీ వరకు ఎక్కడా కూడా బాణాసంచా కాల్చడం, విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, ఘర్షణలకు దిగితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కింద కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమంగా పెట్రోలు, డీజిల్ నిల్వలు ఎక్కడున్నా వెంటనే సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే ప్రజలు డయల్–100, పోలీసు వాట్సప్ 9440900005 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

క్లుప్తంగా

వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని విభిన్నప్రతిభావంతుల వసతి గృహంలో 2024–25 విద్యాసంవత్సరం అడ్మిషన్‌లకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా విభిన్నప్రతిభా వంతుల శాఖ ఏడీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విభిన్నప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డీఎం అండ్‌హెచ్‌ఓ కార్యాలయం ఎదురుగా బాలికల వసతిగృహం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వసతి గృహంలో ఒకటి నుంచి 10 వ తరగతి వరకు, ఇంటర్మీడియెట్, ఆపై తరగతులు చదివే విభిన్నప్రతిభావంతుల బాలికలు అడ్మిషన్ పొందవచ్చన్నారు. 30 సీట్లు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. ఉచితం భోజనం, వసతి, కాస్మొటిక్ చార్జీలు, ఒక సంవత్సరానికి నాలుగు జతల యూనిఫాం, నోటు పుస్తకాలు ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. నలభై శాతం అంగ వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్, టీసీ, రేషన్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్ తదితర పత్రాలతో దరఖాస్తు చేయాలన్నారు. వివరాలకు 9440990698 నంబర్‌లో సంప్రదించవచ్చని ఏడీ తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి



చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో విద్యుత్ షాక్‌తో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. శుక్రవారం ఉదయం ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి కథనం మేరకు.. మిట్టూరులోని నాయుడు బిల్డింగ్స్ వద్ద ఓ ఇల్లు నిర్మాణ దశలో ఉంది. అక్కడ ఒక వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. అటువైపుగా వెళ్లిన గుర్తుతెలియని వ్యక్తి అక్కడున్న విద్యుత్ వైరును పట్టుకోవడంతో గురువారం రాత్రి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు కుడి చేతిపై మురుగన్, చిట్టి అని ఆంగ్లంలో పచ్చబొట్టు వేసుకుని ఉన్నాడు. ఇతని వయస్సు 25– 30 వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో ఉంచామని.. వివరాలు తెలిస్తే 9440796707, డయల్–100ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఉపాధికి మెండైన పాలి‘టెక్నిక్’


- పలమనేరు కళాశాలలో జాబ్ అచీవర్స్‌డే
- 70మందికి అపాయింట్‌మెంట్ ఆర్డర్లను అందించిన ఆర్‌డీఓ



వివిధ కంపెనీలో ఉద్యోగాలను పొందిన పాలిటెక్నిక్ విద్యార్థినులు

పలమనేరు: ఉపాధి, ఉద్యోగాలకు పాలిటెక్నిక్ కోర్సులు దగ్గరి దారిలా మారాయని పలమనేరు ఆర్‌డీవో మనోజ్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం జాబ్ అచీవర్స్‌డేను నిర్వహించారు. ఆయన ముఖ్య అతిధిగా హాజరై వివిధ కంపెనీలో ఉద్యోగాలను సాధించిన వారికి అపాయింట్‌మెంట్ ఆర్డర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలిటెక్నిక్‌లో ఉపాధికి మెండైన అవకాశాలున్నాయన్నారు. చిన్న వయస్సులో ఉద్యోగాలను సాధించి ఆపై ఉన్నత స్థానాలకు వెళ్లేందుకు ఇదో మంచి మార్గమన్నారు. కాబట్టి త్వరగా సెటిల్ కావాలనుకునేవారు పదోతరగతి తర్వాత పాలిటెక్నిక్ కోర్సులను చేయాలని సూచించారు. కళాశాలకు చెందిన ఫైనలియర్ విద్యార్థినిలు 70మంది ఉద్యోగాలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. విస్ట్రాన్, అనీజా కంపెనీలకు చెందిన ప్రతినిధులు, కళాశాల ప్రిన్సిపాల్ మహమూద్, విభాగాధిపతులు లక్ష్మీప్రసన్న, శ్రీవిద్య, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ జయపాల్, సీనియర్ అధ్యాపకులు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అచ్చ తెలుగులో అన్నమయ్య కీర్తనలు



మాట్లాడుతున్న విశ్రాంత ఆచార్యుడు రామ సూర్యనారాయణ

తిరుపతి కల్చరల్ : అచ్చ తెలుగు పదాలతో కీర్తనలు రచించి సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన అన్నమయ్య పద కవితా పితామహుడిగా ప్రసిద్ధి చెందారని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ రామ సూర్యనారాయణ తెలిపారు. అన్నమాచార్యుల 616వ జయంతి ఉత్సవాల్లో భాగంగా అన్నమాచార్య కళామందిరంలో శుక్రవారం సాహిత్య సదస్సులు ప్రారంభమయ్యాయి. ఈ సదస్సుకు అధ్యక్ష వహించిన రామ సూర్యనారాయణ తాళ్లపాక కవులు– పద కవిత్యం అనే అంశంపై ఉపన్యసించారు. అన్నమయ్య సతీమణి తిమ్మక్క సుభద్ర కల్యాణం, కుమారుడు పెద్ద తిరుమలాచార్యులు ద్విపదలో హరివంశం, మనువడు చిన్నన్న ఉషాపరిణయం, అన్నమయ్య చరిత్ర వంటి ద్విపద కవితలను సామాన్యులకు అర్థమయ్యేలా గొప్ప సాహిత్య విలువలతో రచించారని కొనియాడారు. వంశమంతా కవులైన ఖ్యాతి తాళ్లపాక వంశానికే దక్కుతుందన్నారు. అన్నమయ్య పద కవిత్యాన్ని భక్తిపథ కవిత్వంగా మార్చారని వివరించారు. ఆంధ్ర వర్సిటీ విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ మలయ వాసిని అన్నమయ్య కీర్తనలు– వస్తు వైవిధ్యం అనే అంశంపై ప్రసంగించారు. అన్నమయ్య మధుర భక్తితో వస్త్రాశయ సాహిత్యం, ఆత్మాశ్రయ సాహిత్యం అనే రెండు అంశాలతో సంకీర్తనలను రచించినట్లు తెలిపారు. అన్నమయ్య సంకీర్తనలను ఆధ్యాత్మిక విభాగంలో నాలుగు సంపుటాలు, శృంగారం విభాగంలో 22 సంపుటాలుగా విభజించినట్లు వివరించారు. కాకతీయ వర్సిటీ విశ్రాంత ఆచార్యులు డాక్టర్ కాత్యాయనివిద్మహే అన్నమయ్య పద కవితలు–లౌకిక విలువల అనే అంశంపై మాట్లాడారు. లౌకిక జీవితం లేకుండా భక్తి లేదని, సమాజంలో, వ్యక్తిగతంగా ఉన్న సమస్యల పట్ల ఆందోళన చెందుతున్న సందర్భంలో భక్తులు అవుతారని తెలిపారు. అన్నమయ్య అనాటి సామాజిక పరిస్థితుల్లో ఆకలి, కష్టాలు భగవంతుడిని గుర్తు చేస్తాయని, తన కీర్తనల ద్వారా తెలిపారని వెల్లడించారు. కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు విభీషణ శర్మ పాల్గొన్నారు.

ప్రియ సిస్టర్స్ గానామృతం

అన్నమాచార్య కళామందిరంలో చెన్నైకి చెందిన ప్రియ సిస్టర్స్ ఆలపించిన భక్తి సంకీర్తనలు శ్రవణానందకరంగా సాగాయి. అన్నమయ్య సంకీర్తనలను తమదైన శైలిలో సుమధురంగా గానం చేస్తూ భక్తుల హృదయాలను మైమరిపించారు. ఈ క్రమంలో తొలుత అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు మధుసూదన్ రావు బృందం ప్రదర్శించిన భక్తి సంగీతం సభికులను అలరింపజేసింది.

ట్రాన్స్‌కో వర్క్ ఆర్డర్లు పూర్తి చేయాలి

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వర్క్‌ఆర్డర్లను ఏఈలు త్వరితగతిన పూర్తి చేయాలని ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2020–2021, 2021–2022కు సంబంధించి రూ.101 కోట్ల విలువైన 5100 వర్క్‌ఆర్డర్లను పూర్తి చేయాల్సి ఉందన్నారు. పలుమార్లు హెచ్చరిస్తున్నా పని తీరులో మార్పు రావడం లేదన్నారు. మదనపల్లె, చిత్తూరు, పుంగనూరు డివిజన్ల పరంగా వర్క్‌ఆర్డర్లు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సంబంధిత ఏఈలు పనితీరు మార్చుకోకుంటే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అదృశ్యమైన వ్యక్తి శవమై తేలాడు

పూతలపట్టు: మండలం మూర్తిగానూరులో నెలకిందట ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైన వడివేలు(38) అటవీప్రాంతంలో చెట్టుకు ఉరేసుకుని ఉండగా గ్రామస్తులు శుక్రవారం గుర్తించారు. సీఐ సుదర్శన ప్రసాద్ కథనం మేరకు.. వడివేలు చాలా సంవత్సరాల నుంచి అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. నెల కిందట ఇంటి నుంచి కుటుంబ సభ్యులకు చెప్పకుండా వెళ్లి పోయాడు. శుక్రవారం గ్రామ సమీపంలోని నువ్వుల కొండలో చెట్టుకు వేలాడుతున్న వ్యక్తి శవాన్ని గుర్తించి పశువుల కాపరి గ్రామస్తులకు తెలియజేయగా, స్థానికులు పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, ఆ మృతదేహం వడివేలుదేనని నిర్ధారించారు. ఉరేసుకుని చాలా రోజులు కావడంతో మృతదేహం బాగా కుళ్లి పోయి ఉంది. అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుబసభ్యులకు అప్పగించారు.

పుష్పపల్లకీపై ద్రౌపదీదేవి విహారం

- వైభవంగా అర్జున తపస్సుమాను
- యామిగానిపల్లెలో భక్తజన సందడి



తపస్సుమాను అధిరోహిస్తున్న అర్జున వేషధారి

గుడుపల్లె: మండలంలోని యామగానిపల్లెలోని శ్రీ ద్రౌపదీ ధర్మారాజస్వామి ఆలయ మహా భారత మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి పుష్పపల్లకి సేవ, మధ్యాహ్నం అర్జున తపస్సుమాను కార్యక్రమాలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అర్జున తపస్సుమాను ఘట్టం ప్రారంభమైంది. అర్జున వేషధారి తపస్సుమాను చుట్టూ ప్రదక్షిణ చేసి పూజలు చేశారు. పరమశివుని వరం పొందేందుకు పద్యాలతో కీర్తిస్తూ తపస్సుమాను అధిరోహించారు. అక్కడి నుంచి నిమ్మపండ్లు, విబూతిపండ్లు భక్తులపై విసిరారు. వాటిని అందుకునేందుకు భక్తులు ఎగబడ్డారు. సంతాన వరం కోరుతూ పలువురు మహిళలు తపస్సుమాను చుట్టూ వరపడ్డారు. తపస్సు మాను ఘట్టం తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి జనం భారీగా విచ్చేశారు. రాత్రి పుష్పపల్లకి ఊరేగింపు నేత్రపర్వంగా జరిగింది. అమ్మవారి ఉత్సవమూర్తిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి పల్లకిపై కొలువుదీర్చి పూజలు చేశారు. అనంతరం మంగళవాయిద్యాలు, బాణ సంచా పేలుళ్ల సందడి నడుమ ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు.

డీవైఈఓ పరీక్షలకు సర్వం సిద్ధం

- నేడు జిల్లాలో 3 కేంద్రాల్లో పరీక్షలు
- హాజరుకానున్న 730మంది అభ్యర్థులు
- డీఆర్‌ఓ పుల్లయ్య వెల్లడి

చిత్తూరు కలెక్టరేట్ : ఏపీపీఎస్‌సీ (డీవైఈఓ) పోస్టుల పరీక్షలకు అభ్యర్థులు నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించేది లేదని డీఆర్‌ఓ పుల్లయ్య స్పష్టం చేశారు. శనివారం నిర్వహించే ఏపీపీఎస్‌సీ (డీవైఈఓ) పోస్టుల పరీక్షల నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్‌లో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. జిల్లాలోని 3 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు పరీక్ష కేంద్రాల్లో 730 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు చెప్పారు. చిత్తూరు పరిధిలోని సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంలో 150 మంది, పూతలపట్టు మండలం వేము ఇంజినీరింగ్ కళాశాలలో 330 మంది, పలమనేరు మండలం మదర్‌థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంలో 250 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్ష ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు జరుగుతుందన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాల వద్దకు ఉదయం 7 గంటల నుంచి 8.30 గంటల మధ్యలో చేరుకోవాలన్నారు. పరీక్ష రాసే వారిలో దివ్యాంగులున్నట్‌లైతే తనకంటే తక్కువ విద్యార్హత ఉన్న వారిని సహాయకులుగా వెంట తీసుకురావచ్చన్నారు. పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరని తెలిపారు. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. హాల్‌టికెట్, గుర్తింపుకార్డు, వాటర్‌బాటిల్ మాత్రమే లోనికి అనుమతిస్తామని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు కేశవమూర్తి, కేశవులు, శిరీష, కులాయప్ప, ఉమామహేశ్వర్‌రెడ్డి, కలెక్టరేట్ సీ సెక్షన్ సూపరింటెండెంట్ గుణశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసులను ఉపసంహరించండి



డీఆర్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో సంఘ నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల్లో విధులకు గైర్హాజరైన ఉద్యోగులకు జారీచేసిన షోకాజ్ నోటీసులను మానవతా దృక్పథంతో ఉపసంహరించాలని ఫ్యాప్టో సంఘ నాయకులు గంటామోహన్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘ నాయకులు కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ పుల్లయను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పలువురు ఉద్యోగులు అనారోగ్య కారణాలతో విధులకు హాజరుకాలేకపోయారన్నారు. 13వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత ఎన్నికల విధులు నిర్వహించినందుకు ఎన్నికల సిబ్బందికి 14వ తేదీ ఆన్‌డ్యూటీగా పరిగణించి డ్యూటీ సర్టిఫికెట్ జారీచేయాలని కోరారు. వివిధ తనిఖీ కేంద్రాల్లో విధులు నిర్వహించిన ఎంఈఓ, హెచ్‌ఎంలకు రెమ్యూనరేషన్ చెల్లించాలన్నారు. డీఆర్‌ఓ స్పందిస్తూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సంఘ నాయకులు మణికంఠ, ముక్తార్ అహ్మద్, కిరణ్‌కుమార్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇక మేమెలా బతకాలి తండ్రీ...

- ఢిల్లీ రోడ్డు ప్రమాదంలో చౌడేపల్లె యువకుడు మృతి
- ఒక్కగానొక్క కుమారుడి మృతితో కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు
- దుఖంలోనూ అవయవదానానికి అంగీకారం



మృతుడు హర్షల్ (ఫైల్)

చౌడేపల్లె: ఒక్కగానొక్క కొడుకు ఉన్నత చదువులు చదివి చరమాంకంలో తమకు అండగా ఉంటాడని ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆ తల్లిదండ్రులకు తీరని వేదన మిగిలింది. రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతి చెందడంతో వారి దుఃఖానికి అంతేలేకుండా పోయింది. వివరాలిలా..ఢిల్లీలో మూడురోజుల కిందట మధురమండిచౌర ఆలయం ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో చౌడేపల్లె హైస్కూల్ వీధికి చెందిన పగడాల భవాని, రవి దంపతుల కుమారుడు హర్షల్ (21)తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. హర్షల్ ఢిల్లీలోని శాన్‌స్కిటీ యూనివర్సిటీలో అగ్రికల్చర్ బీఎస్సీ కోర్సు చదువుతున్నాడు. మరో రెండు రోజుల్లో కోర్సు పూర్తి చేసి ఇంటికి వస్తానని చెప్పిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్నేహితులు ఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు వెంటనే ఢిల్లీకి చేరుకున్నారు. కోలుకుంటాడనుకున్న తరుణంలో వారికి విషాదమే మిగిలింది. ఒక్కగానొక్క కుమారుడు తిరిగిరాని లోకాలకు వెళ్లి పోయాడు. అంతటి దుఃఖంలోనూ ఆస్పత్రి వైద్యుల సలహామేరకు తమ కుమారుడి అవయవ దానానికి తల్లిదండ్రులు అంగీకరించారు. హర్షల్ ఇక లేదని తెలియడంతో స్థానికంగా చౌడేపల్లెలో ఉండే స్నేహితులు, సన్నిహితులు ఇంటివద్దకు చేరుకున్నారు. ఢిల్లీ నుంచి మృతదేహం కోసం విషణ్ణ వదనంతో ఎదురుచూస్తున్నారు.

ఫోర్జరీ డాక్యుమెంట్ తయారీ–ఆరుగురిపై కేసు



స్థలం విషయంగా మధ్యవర్తులు, లాయర్లను నిలదీస్తున్న బాధితులు

గంగవరం/పలమనేరు: కొందరు మధ్యవర్తులు, లాయర్లతో కలసి పదికోట్లు విలువైన తమ భూమికి ఫోర్జరీ డాక్యుమెంట్ ద్వారా మోసం చేశారని బాధితులు శుక్రవారం గంగవరం పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇందుకు కారకులైన ఆరుగురిపై అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గంగవరం రెవెన్యూ పరిధిలోని రొంటకుంట్ల గ్రామంలో 358/1 సర్వే నంబర్ 3.54 ఎకరాల భూమి ఆదే గ్రామానికి చెందిన చెల్లెమ్మకు చెందింది. ఈమెకు వారసులైన నలుగురు కుమార్తెలు రమాదేవి, లక్ష్మీదేవి, కళావతి, ప్రమీల ఆ భూమిని విక్రయించాలని భావించారు. దీంతో కొందరు మధ్యవర్తులు తాము భూమిని విక్రయిస్తామంటూ వారిని నమ్మించారు. అయితే తక్కువ ధర చెప్పడంతో విక్రయదారులు అందుకు సమ్మతించలేదు. దీంతో వారు కొందరు లాయర్లతో కలసి వారు విక్రయించినట్టు నకిలీ అగ్రిమెంట్‌లను తయారు చేసి వాటిలో ఫోర్జరీ సంతకాలను పెట్టి కోర్టులో కేసు వేశారు. ఇందుకు సంబంధించి వారసులైన నలుగురు అక్కాచెల్లెళ్లకు నోటీసులు అందాయి. దీంతో విషయం తెలుసుకున్న వారు సంబంధిత మధ్యవర్తులు, లాయర్లతో శుక్రవారం గొడవకు దిగి తమను అన్యాయం చేస్తారా అంటూ నిలదీశారు. ఇంతలో అక్కడికి చేరుకున్న పోలీసులు గొడవలు లేకుండా చేసి మోసం చేసిన వారిపై ఫిర్యాదు చేయాలంటూ సూచించారు. బాధితులు గోవర్ధన్‌రెడ్డి, దిలీప్‌కుమార్, అనిల్‌కుమార్, నయాజ్, డాక్యుమెంట్ రైటర్ సుబ్రమణ్యంపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు విచారిస్తున్నారు.

మద్యం మత్తులో తన్నుకున్న తమ్ముళ్లు



గాయపడ్డ జగదీష్‌ను ఆస్పత్రిలో విచారిస్తున్న పోలీసులు

కుప్పం: మద్యం మత్తులో తెలుగు తమ్ముళ్లు తన్నుకున్నారు. ఒకరిపై ఒకరు పిడిగుద్దులు కురిపించుకున్నారు. ఆపై విరువర్గాల వారు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల కథనం.. కుప్పంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో మాజీ జెడ్పీటీసీ రాజ్‌కుమార్ అనుచరులు నలుగురు మద్యం మత్తులో అక్కడే ఉన్న హెచ్‌పీ రోడ్డుకు చెందిన టీడీపీ కార్యకర్త జగదీష్‌పై దాడి చేశారు. దీంతో గాయపడ్డ జగదీష్ తనపై శరత్, విజయకుమార్, బాలసుబ్రమణ్యం, చిరంజీవి దాడి చేశారని కుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గాయాలతో కుప్పం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జగదీష్ స్టేట్‌మెంట్‌ను పోలీసులు రికార్డు చేశారు. కాగా జగదీష్ తమపై దాడి చేశాడని రాజ్‌కుమార్ అనుచరులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలావుండగా.. వీరంతా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు లోకేష్‌కు ముఖ్య అనుచరులు కావడం గమనార్హం.

సిద్ధార్థలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థినికి ఇంజినీరింగ్ పట్టా అందజేస్తున్న చంద్రశేఖర్, హేమచంద్రారెడ్డి తదితరులు

నారాయణవనం: సిద్ధార్థ గ్రూప్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలల్లో శుక్రవారం బీటెక్ విద్యార్థులు గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆడిటోరియంలో ఉదయం సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో 386 మందికి, మధ్యాహ్నం సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో 854 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు, ప్రతిభను కనబరిచిన 14 మందికి గోల్డ్ మెడల్స్ అందజేశారు. ఇందులో ముఖ్య అతిథులుగా ఏపీసీటీఈ చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ బుద్ధా చంద్రశేఖర్, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ డాక్టర్ హేమచంద్రారెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ టెక్నాలజీ పరంగా బీటెక్ డిగ్రీ నామమాత్రమేనన్నారు. నైపుణ్య ప్రమాణాలను పెంచుకోవడం ద్వారా పరిపూర్ణ ఇంజినీర్లుగా ఎదగాలని సూచించారు. డబ్బు సంపాదన కోసమే కాకుండా సమాజ అభివృద్ధికి ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. కళాశాల చైర్మన్ అశోకరాజు మాట్లాడుతూ చదువుకోవడం గొప్ప అనుపించుకోదన్నారు. సంస్కారం, క్రమశిక్షణ, అనుభవం తోడైతేనే పరిపూర్ణ స్థాయికి చేరుకుంటారని పేర్కొన్నారు. వృత్తి విద్యను అభ్యసిస్తున్న యువ ఇంజినీర్లకు సాధన ఎంతో అవసరమని వివరించారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాళ్లు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ జనార్ధనరాజు, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పరిపూర్ణం.. కోన సంబరం



విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు



తెప్పపై విహరిస్తున్న దేవదేవేరులు

రాపూరు : పెంచలకోనలో శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. చివరి రోజు ఉదయం శ్రీవారి చక్రస్నాన ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లతోపాటు చక్రతాళ్వార్‌ను పల్లకిలో కొలువుదీర్చారు. మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా శ్రీవారి నందన వనంలోని పుష్కరిణి వద్ద మండపంలోకి వేంచేపు చేశారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, నవకలశ స్నపన తిరుమంజనం నిర్వహించారు. పసుపు, కుంకుమ, చందనం, సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు జరిపించారు. అనంతరం వేదపండితులు మంత్రోచ్చరణల నడుమ పుష్కరిణిలో చక్రతాళ్వార్‌కు స్నానం చేయించారు. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు పవిత్ర పుష్కరిణిలో స్నానమాచరించి తన్మయత్వం చెందారు. మూడు సార్లు చక్ర స్నానం చేయించారు.

తెప్పోత్సాహం

శోభాయమానంగా అలంకరించిన తెప్పపై పెనుశిల నృసింహస్వామి ఉభయనాంచారులతో కలసి పుష్కరిణిలో విహరిస్తూ భక్తులకు దర్శమిచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై దేవదేవేరులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి 10 గంటలకు స్వామివారిని అశ్వవాహనంపై కొలువుదీర్చి మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. రాత్రి 11 గంటలకు అర్చకులు శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం జరిపించి బ్రహ్మోత్సవాలను పరిపూర్ణం చేశారు. కార్యక్రమాల్లో కార్యక్రమంలో డీసీ విజయసాగర్‌బాబు, ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు, ఉప ప్రధానార్చకులు పెంచలయ్యస్వామి, సీతా రామయ్యస్వామి, టీటీడీ పాంచరాత్ర ఆగమపండితులు రామానుజాచార్యులు పాల్గొన్నారు.